# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
20-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 118

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





# బిజెపికి చికిత్స!

గ్రూపులకు ఫుల్ స్టాప్

రంగంలోకి ఢిల్లీ పెద్దలు

బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య సయోధ్య

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** అందుకే తెలంగాణలో బిజెపిని గాడిలో పెట్టేందుకు ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ఇన్చార్జ్ అభయ్ పాటిల్ హైదరాబాద్ వచ్చి సీనియర్ నేతలతో వరుసగా సమావేశం అవుతూ వస్తున్నారు.

“ తెలంగాణలో అధికారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ముందుకు సాగుతోంది. కానీ ఆ పార్టీలో అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య ఆధిపత్య పోరాటాలు పెద్ద తలనొప్పిగా మారాయి. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బిజెపి గ్రాఫ్ పెరిగింది. కానీ క్షేత్రస్థాయిలో పార్టీలో విభేదాలు, నాయకుల మధ్య సమన్వయ లోపం పార్టీ హై కమాండ్ ను కలవరపెడుతోంది.

2లో



# గులాబీకి మల్లారెడ్డి గుడ్ బై?

కొంతకాలంగా బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరం

ఘట్‌కేసర్‌లో సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రత్యక్షం

కేసీఆర్ పై రేవంత్ తీవ్ర విమర్శలు చేసినా

సభ ముగిశాక నోరు మెదపని మల్లారెడ్డి

పార్టీ నుంచి వెళ్లిపోతారని శ్రేణుల అనుమానం

సోషల్ మీడియా వేదికగా విమర్శల దాడి

బీఆర్ఎస్ లో ఎప్పుడూ చురుగ్గా ఉంటూ.. సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తూ..

2లో

# జగజ్జేత స్పెయిన్

రెండోసారి ప్రపంచకప్ టైటిల్ సొంతం

ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాపై విజయం

అదనపు సమయంలో గోల్ కొట్టిన స్పెయిన్

అసాధారణ ప్రదర్శన కనబరిచిన అర్జెంటీనా గోల్‌కీపర్



“ ఒకవైపు పటిష్టమైన డిఫెన్స్... మరోవైపు పాదరసంలాంటి కదలికలతో అటాకింగ్... వెరసి స్పెయిన్ జట్టు రెండోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున ముగిసిన ఫైనల్లో స్పెయిన్ 1--0 గోల్ తేడాతో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా జట్టును ఓడించింది. అదనపు సమయంలోని 106వ నిమిషంలో సబ్‌సిట్యూట్ ఫెరాన్ టోరెస్ గోల్‌తో స్పెయిన్ జట్టు విజయం అందుకుంది.

న్యూయార్క్: పెడ్రో పోరో కుడి వైపు నుంచి కొట్టిన క్రాస్ పాస్‌ను ‘డి’ ఏరియాలో నికో విలియమ్స్ హెడర్ షాట్‌తో వెనక్కి పంపించాడు. అక్కడే ఉన్న ఫెరాన్ టోరెస్ అర్జెంటీనా గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ బంతిని లక్ష్యానికి చేర్చాడు. దాంతో స్పెయిన్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత అదనపు సమయంలో మిగిలిన క్షణాల్లో అర్జెంటీనాను నిలువరించి స్పెయిన్ ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. 2010లో స్పెయిన్ తొలిసారి ప్రపంచకప్ గెలిచింది. నెదర్లాండ్స్‌తో ఆనాడు జరిగిన ఫైనల్లోనూ స్పెయిన్ అదనపు సమయంలోని రెండో అర్ధభాగంలో ఇనియెస్టా చేసిన గోల్‌తో విజయం అందుకుంది. 16 ఏళ్ల తర్వాత అలాంటి దృశ్యమే పునరావృతమైంది. అంతకుముందు నిర్ణీత 90 నిమిషాల్లో రెండు జట్లు గోల్ చేయలేదు. 90౦3వ నిమిషంలో అర్జెంటీనా ప్లేయర్ ఎంజో ఫెర్నాండెజ్ రెడ్ కార్డుకు గురయ్యాడు.

- మిగతా 2వ పేజీలో

# ట్రాన్స్ జెండర్లకు పదవులు!

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

మున్సిపాలిటీలు / నగరపాలక సంస్థల్లో నామినేటెడ్ పోస్టులు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజకీయ, సామాజిక చరిత్రలో ఒక సరికొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టింది.. సీఎం రేవంత్ నేతృత్వంలోని




నామినేటెడ్ సభ్యురాలు (ట్రాన్స్ జెండర్ ప్రతినిధి)



2లో

# ముహూర్తం ఫిక్స్!

ఆగస్టు 1న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం

ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం

ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ఉత్తరాంధ్రలో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. విజయనగరం జిల్లా భోగాపురంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఆధునిక హంగులతో అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయింది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం కూడా జరిగింది.



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఆగస్టు 1న భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయం జాతికి అంకితం చేయనున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు

2లో

# కోమటిరెడ్డి వెంకట్రెడ్డితో సంబంధం లేదు!

తేల్చి చెప్పిన రాజగోపాల్ రెడ్డి

మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని హెచ్చరిక



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో మంత్రి పదవి ఆశిస్తున్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. కానీ అది అందని ద్రాక్ష గానే ఉంది. అయితే తాజాగా మళ్లీ మంత్రి పదవుల ప్రస్తావన రావడంతో..

# ‘హైడ్రా’ దూకుడు!

మళ్లీ రంగంలోకి.. శనివారం ఒక్కరోజే రూ.30 వేల కోట్ల ఆస్తుల రక్షణ

ఆక్రమణదారుల గుండెల్లో వణుకు

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** హైడ్రా మరోసారి సంచలనం సృష్టించింది. తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లాల పరిధిలో ఏకకాలంలో భారీ మెగా డ్రైవ్ నిర్వహించింది.




# గులాబీకి మల్లారెడ్డి గుడ్ బై?

(మొదటి పేజీ తరువాయి)

నిత్యం వార్తల్లో నిలిచే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రస్తుతం అందుకు భిన్నంగా వార్తల్లో నిలుస్తున్నారు. తన ప్రసంగాల్లో, మీడియా సమావేశాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై విపరీతమైన అభిమానం చూపించే మల్లారెడ్డి ఇప్పుడు వారి పేరు కూడా తీయడంలేదు. పార్టీ కార్యక్రమాలకూ హాజరుకావడంలేదు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సభలో మాత్రం పాల్గొన్నారు. అంతేకాదు.. రేవంత్ తన ముందే కేసీఆర్ ను, ఆయన కుటుంబాన్ని తీవ్రంగా విమర్శించినా, దూషించినా మల్లారెడ్డి ఆ తరువాత నోరు కూడా మెదపలేదు. దీంతో ఆయన బీఆర్ఎస్ ను వీడతారన్న ప్రచారం జరుగుతోంది. "పాలమ్మిన.. పూలమ్మిన.. బోర్ వెల్స్ నడిపించిన.. కాలేజీలు పెట్టిన.. రాజకీయాల్లోకి వచ్చిన.. కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రిని అయిన" ఇదీ మల్లారెడ్డి ప్రతిచోటా చెప్పే మాట. కానీ, కొన్నాళ్లుగా ఆయన గొంతు ఎక్కడా వినిపించడంలేదు. బీఆర్ఎస్ క్యాడర్ నూ పట్టించుకోవడంలేదు. పార్టీ అధిష్టానం చేపట్టిన సభ్యత్వ నమోదుకూ హాజరు కావడంలేదు. కానీ, కాంగ్రెస్, బీజేపీ నేతలతో మాత్రం సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ నెల 18న ఘట్‌కేసర్‌లో సీఎం రేవంతరెడ్డి నిర్వహించిన సభకు



కూడా హాజరయ్యారు.. ఆ సభలో సీఎం రేవంతరెడ్డి కేసీఆర్ కుటుంబాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నా పట్టించుకోలేదు.. ప్రభుత్వం నిర్వహించిన ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేగా పాల్గొన్నారనుకున్నా.. సభ ముగిసిన తర్వాత కూడా కనీసం ఈ అంశంపై స్పందించలేదు బీఆర్ఎస్ శ్రేణులు మల్లారెడ్డిపై సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. మల్లారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు క్రిశాంక్ సైతం విమర్శ:లు ఎక్కుపెట్టారు. అయినా మల్లారెడ్డి నుంచి ఎటువంటి స్పందన రావడంలేదు. దీంతో ఆయన పార్టీ మారడం ఖాయమనే ప్రచారం ఊపందుకుంది.

**కుటుంబంతో కలిసి ప్రధాని మోదీ వద్దకు..**

మల్లారెడ్డి గతంతో తన కొడుకు భద్రారెడ్డి, కోడలు ప్రీతిరెడ్డితో కలిసి ప్రధాని నరేంద్రమోదీని ఢిల్లీకి వెళ్లి కలిసిన విషయం తెలిసిందే. తనవిద్యాసంస్థల వ్యాప్తిలో భాగంగానే ప్రధానిని కలిసినట్టు సన్నిహితులు చెప్పుకొచ్చినా.. బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం ఆయన బీజేపీలో చేరడానికి మార్గం సుగమం చేసుకునేందుకే మోదీని కలిశారని నమ్ముతున్నారు. తన వ్యాపార సామ్రాజ్యాన్ని దేశమంతటా విస్తరింపజేసేందుకు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మద్దతు కోసం మల్లారెడ్డి ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం కూడా జరుగుతోంది. దీంతో ఆయనను తమ పార్టీలో తీసుకురావాలని భావించిన కొందరు కాంగ్రెస్ సీనియర్లు పీసీసీ స్థాయిలో చర్చలు జరిపినట్టు తెలిసింది. గతంలో ఆయన ప్రస్తుత కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూడా కలిశారు. పైగా ఇటీవలి కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగ్గించారు. జీహెచఎంసీ ఎన్నికల వరకు మల్లారెడ్డి కాంగట?స్రలోకి వస్తారంటూ ఆ పార్టీ నేతలు కొందరు ప్రచారం చేస్తున్నారు.

# జగజ్జేత స్పెయిన్

దాంతో అదనపు సమయంలో 30 నిమిషాలు అర్జెంటీనా 10 మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. ఈ సువర్ణావకాశాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది. పదే పదే దాడులు చేస్తూ 106వ నిమిషంలో ఫలితాన్ని సాధించింది. మ్యాచ్ మొత్తంలో అర్జెంటీనా గోల్‌కీపర్ ఎమిలియో మార్టీనెజ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 12 సార్లు స్పెయిన్ ఆటగాళ్లు గోల్‌పోస్ట్ లక్ష్యంగా కొట్టిన షాట్‌లను నిలువరించాడు. అయితే 13వ ప్రయత్నంలో మాత్రం మార్టీనెజ్ ఏమీ చేయలేకపోయాడు. ఫైనల్ చేరే క్రమంలో 19 గోల్స్ కొట్టిన అర్జెంటీనా తుది పోరులో పూర్తిగా నిరాశపరిచింది. స్పెయిన్ ఫార్వర్డ్ ఆటగాళ్లను అడ్డుకోవడంలోనే అర్జెంటీనాకు సరిపోయింది.

# ముహూర్తం ఫిక్స్!



రామ్మోహన్ నాయుడు ఈ విషయాన్ని ప్రకటించారు.

**విభజన హామీల్లో భాగంగా..**

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఏపీకి అంతర్జాతీయ విమానాశ్రయం మంజూరు అయ్యింది.. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో 2200 ఎకరాల విస్తీర్ణంలో ఎయిర్ పోర్టు నిర్మాణం జరిగింది. 100% పనులు పూర్తి కావడంతో ఇప్పుడు ఈ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేయనున్నారు. జిఎంఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో సుమారు రూ.4500 కోట్ల భారీవ్యయంతో ఈ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించారు. విమానాశ్రయ నిర్వహణకు అవసరమైన ఏరో డ్రోమ్ లైసెన్సు లభించడంతోపాటు కేంద్ర హోం శాఖ కూడా దీనిని అధికారిక ఇన్నిగ్రేషన్ చెక్‌పోస్ట్ గా గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో విదేశీ సర్వీసుల నిర్వహణకు సైతం మార్గం సుగమం అయింది.

**జాతీయ రహదారి చెంతనే..**

చెన్నై- కోల్కత్తా జాతీయ రహదారికి సమీపంలో.. బంగాళాఖాతం చెంతనే ఈ ఎయిర్పోర్టు అందుబాటులోకి రావడం విశేషం. ఉత్తరాంధ్ర పరిధిలోని పరిశ్రమలు, ఐటి రంగం, పర్యాటక రంగాలు అద్భుతమైన వృద్ధిని సాధిస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విమానాశ్రయానికి వేగంగా చేరుకునేలా రాష్ట్ర ప్రభుత్వం విశాఖ బీచ్ రోడ్డు నుంచి భోగాపురం వరకు ఒక ప్రత్యేక డెడికేటెడ్ కనెక్టివిటీ రూటు కూడా సిద్ధం చేసింది. ఆగస్టు 1న విమానాశ్రయం ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రధానమంత్రి కార్యాలయం సైతం గ్రీన్ సిగ్నల్ తెలిపింది. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని ఒక వేడుకగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు సంబంధించి మిగతా ప్రోటోకాల్ షెడ్యూల్, పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటించనుంది ప్రభుత్వం.

# కోమటిరెడ్డి వెంకట్రెడ్డితో సంబంధం లేదు!

(మొదటి పేజీ తరువాయి)

తెరపైకి వచ్చారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. తన సోదరుడు వెంకట్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ సర్కిల్స్ లో ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. మేం సోదరులమే అయినా మా కుటుంబాలు వేరు.. మంత్రి వెంకట్ రెడ్డి కుటుంబం, నా కుటుంబం ఒక్కటి కాదు. మంత్రి పదవి విషయంలో ఆయనతో నాకు ఎలాంటి సంబంధం లేదు అని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత పరిస్థితులపై మరోసారి చర్చకు దారి తీసాయి. గత కొంతకాలంగా మంత్రి పదవి రాకపోవడం పై తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు రాజగోపాల్ రెడ్డి. ఇప్పుడు మరోసారి ఇదే అంశాన్ని ప్రస్తావించి హాట్ టాపిక్ అయ్యారు.

**మంత్రి పదవి పై ఆశ..**

రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి ఆశిస్తున్నారు. కాంగ్రెస్ హై కమాండ్ ను కూడా ఆయన ఇదే కోరారు. మొన్నటి ఎన్నికలకు ముందు బిజెపి నుంచి కాంగ్రెస్లో చేరిన క్రమంలో మంత్రి పదవి హామీ పొందారు. కానీ అది దక్కకపోయేసరికి పలుమార్లు తన ఆవేదన వ్యక్తం చేశారు. అసంతృప్తిని సైతం బయట పెట్టుకున్నారు. ఇప్పుడు కూడా అటువంటి వ్యాఖ్యలు చేశారు. తనకు పదవి అడుక్కోవడం రాదు అని.. పోరాటం చేయడమే తనకు తెలుసు అని వ్యాఖ్యానించారు. తద్వారా మంత్రి పదవి రాకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధం అని తేల్చి చెప్పారు.

**తరచూ అసంతృప్త వ్యాఖ్యలు..**

మొన్న ఆ మధ్యన ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి పైనే వ్యాఖ్యానించారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీని పక్క నుంచి వచ్చిన పార్టీ నేతలు ఏలుతున్నారు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో తాను సీనియర్ నాయకుడిని అంటూ చెప్పుకున్నారు. మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జరుగుతున్న ప్రతిసారి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇదే తరహా వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. అయితే ఒకే కుటుంబంలో ఇద్దరు నేతలకు పదవులు ఇవ్వడం కుదరదు అని హైకమాండ్ తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అందుకే కోమటిరెడ్డి వెంకట్రెడ్డి వేరు.. తాను వేరు అన్నట్టు మాట్లాడుతున్నారు. మంత్రివర్గంలో స్థానం కల్పించకపోతే ప్రతిఘటన తప్పదు అని సంకేతాలు పంపిస్తున్నారు. మరి ఆయనకు క్యాబినెట్లో చోటు దక్కుతుందా? లేదా అన్నది చూడాలి.

# 'హైడ్రా' దూకుడు!



(మొదటి పేజీ తరువాయి)

ఏకంగా ఎనిమిది వందల నలభై ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి విముక్తి కల్పించింది. ఆ భూములను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంది. మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి సుమారు 30 వేల కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నిజంగా ఇది రికార్డు బ్రేక్.

**కొద్దికాలం విరామం..**

గత కొంతకాలంగా హైడ్రా విరామం తీసుకుంది. కానీ శనివారం భారీ ఆపరేషన్ కు తెర తీసింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్ గూడ లో అత్యధికంగా 650 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. చుట్టూ ఫెన్సింగ్ కూడా వేశారు. 1954 ఖాస్ర పహాని రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిగా ఉంది. అయినా కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఫామ్ హౌస్ లు నిర్మించి ఆక్రమించుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఆక్రమణదారులు ప్రతిఘటించిన అధికారులు విడిచిపెట్టలేదు. భారీ పోలీసు బందోబస్తు నడుమ ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు.

**విలువైన భూములు స్వాధీనం..**

మరోవైపు హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్గిరి జిల్లాల సరిహద్దుల్లోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో జనరల్ ల్యాండ్ రిజిస్టర్ కింద నమోదైన 15 ఎకరాల విలువైన భూమిని కూడా హైడ్రాధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ కొండలను బద్దలు కొడుతూ.. అక్రమ లేఅవుట్లు వేసి వన్యప్రాణులకు సైతం హాని కలిగిస్తూ కొందరు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అటువంటి భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. వీటితోపాటు ఐటీ హబ్ సమీపంలోని అత్యంత ఖరీదైన రాయదుర్గంలో ఆక్రమణలకు గురైన 84 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని కంచ ఏర్పాటు చేశారు.

**అన్ని శాఖల సమన్వయంతో..**

మళ్లీ హైదరాబాద్ దూకుడు పెంచడంతో ఆక్రమణదారుల్లో ప్రకంపనలు రేగుతున్నాయి. రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పోలీస్ శాఖలతో పక్కాగా సమన్వయం చేసుకుంటూ హైడ్రా మెగా ఆపరేషన్ ను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రభుత్వ భూములు, చెరువులు, ప్రజా ఆస్తులను కబ్జాదారుల భారీ నుంచి కాపాడేందుకు సీఎం రేవంత్ సర్కార్ ఏర్పాటు చేసిన ఈ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ల్యాండ్ మాఫియా గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. వారాంతపు నాడు హైడ్రా రంగంలోకి దిగుతోంది. గత కొద్ది రోజులుగా స్వల్ప విరామం ఇచ్చింది. కానీ ఇప్పుడు మరోసారి తన దూకుడు పెంచింది.

# ట్రాన్స్ జెండర్లకు పదవులు!

తెలంగాణ క్యాబినెట్ అత్యంత సాహసవంతమైన నిర్ణయానికి ఆమోదముద్ర వేసింది. రాష్ట్రంలోని ప్రతి మున్సిపల్ కౌన్సిల్, మున్సిపల్ కార్పొరేషన్ లో ఒక ట్రాన్స్ జెండర్ ప్రతినిధిని నామినేటెడ్ సభ్యుడిగా, సభ్యురాలిగా నియమించాలని క్యాబినెట్ అధికారికంగా తీర్మానించింది. దీనికి సంబంధించి తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019కి అవసరమైన సవరణలు చేసే ప్రతిపాదనకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఆరో కో ఆప్టేడ్ సభ్యుడు..**

ప్రభుత్వ తాజా నిర్ణయంతో ప్రతి మున్సిపాలిటీ / కార్పొరేషన్ లో ఐదుగురు కో ఆప్టేడ్ సభ్యులు ఉండగా... ఇప్పుడు ఆరో సభ్యుడుకు పెంచుతూ ప్రభుత్వం సవరణ చేయనుంది. అలా పెంచిన అదనపు స్థానాన్ని పూర్తిగా ట్రాన్స్ జెండర్లకే రిజర్వ్ చేయనున్నారు. స్థానిక సంస్థల్లో మైనారిటీలకు ఇచ్చే ప్రాతినిధ్యం తరహాలోనే.. సమాజంలో తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్న ఆ వర్గానికి చట్టసభల్లో, నిర్ణయాధికారాల్లో భాగస్వామ్యం కల్పించాలని ఉన్నతమైన ఆశయంతోనే రేవంత్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. తద్వారా స్థానిక పట్టణాభివృద్ధి ప్రణాళికలో వారి గొంతుక వినబడనుంది. అయితే ఇది ఒక రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు. సమాజంలో కొన్ని శతాబ్దాలుగా వివక్షకు గురవుతున్న ఒక వ్యవస్థ పై అద్భుతమైన ప్రయోగం చేసినట్టే.

**ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియామకం..**

ఇప్పటికే ట్రాన్స్ జెండర్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం అమలు చేస్తోంది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ లో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా వారికి ఉపాధి కల్పించింది. పలు ప్రభుత్వ విభాగాల్లో వారికి ప్రాధాన్యత దక్కుతోంది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ నుంచి ఒక ట్రాన్స్ జెండర్ కౌన్సిలర్ గా విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ఆస్ఫూర్తిని మరింతగా ముందుకు తీసుకెళ్తూ.. ఎన్నికల్లో పోటీ చేసే ఆర్థిక శక్తి లేని వారికి కూడా నామినేటెడ్ పద్ధతిలో పదవి ఇచ్చి గౌరవించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇది గొప్ప నిర్ణయం అని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# బిజెపికి చికిత్స!

**సమన్వయ లోపం..**

బిజెపిలో పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కొరవడుతోంది. ప్రధానంగా వివిధ పార్టీల నుంచి చేరిన నేతలతో పాత నేతలకు ఆశించిన స్థాయిలో పడడం లేదు. ముఖ్యంగా కేంద్రమంత్రి బండి సంజయ్ వర్సెస్ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నట్టు ఉంది పరిస్థితి. వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్న రీతిలో పరిస్థితి ఉంది. అందుకే ఆ ఇద్దరి నేతల మధ్య సయోధ్యకు బిజెపి పెద్దలు ప్రయత్నాలు చేశారు అనేది ప్రచారం. తెలంగాణలో కష్టపడి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసింది తాను అని బండి సంజయ్ చెబుతున్నారు.. మధ్యలో వచ్చిన ఈటెల రాజేందర్ అతి చేస్తున్నారని ఆగ్రహం కూడా ఉంది. మరోవైపు బండి సంజయ్ కంటే తాను సీనియర్ నాయకుడిని అని.. రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించానని ఈటెల రాజేందర్ భావిస్తున్నారు. అయితే ఇప్పుడు ఆ ఇద్దరు నేతలు బిజెపి కి కీలకం. అందుకే వారి మధ్య సయోధ్య కుదుర్చేందుకు బిజెపి పెద్దలు నడుము బిగించారు.

**ప్రతి నేత వెనుక గ్రూపు..**

అయితే బిజెపిలో గ్రూపుల గోల ఉంది. రాష్ట్ర కమిటీ లో ఉన్న ప్రతి నేత ఒక గ్రూపు నడుపుతున్నారని విమర్శ ఉంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కు, ప్రస్తుత రాష్ట్ర బిజెపి అధ్యక్షుడికి పడడం లేదని తెలుస్తోంది. బండి సంజయ్ తో అరవింద్ కు విభేదాలు ఉన్నట్లు నడుస్తోంది ప్రచారం. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి, మిగతా సీనియర్ల మధ్య సమన్వయ లోపం ఉంది. అందుకే అభయ్ పాటిల్ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మీడియా ముందు విభేదాలు బయటపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. అయితే పార్టీ లైను దాటి ఎవరు వ్యవహరించవద్దని.. ఈ విషయంలో హై కమాండ్ సీరియస్ గా ఉందన్న విషయాన్ని చెప్పుకొచ్చారు. మరోవైపు అగ్రనేతలంతా ఏకతాటి పైకి రావాలని అమిత్ షా ఆదేశించారని కూడా చెప్పినట్లు సమాచారం. మరి బిజెపి లో గ్రూపుల గోలకు ఫుల్ స్టాప్ పడుతుందా? లేకుంటే కొనసాగుతుందా అన్నది చూడాలి.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 20-7-2026


# బహదూర్‌గూడ రైతుల భూముల పరిరక్షణ కోసం బీజేపీ ధర్నా

## రైతులకు అండగా నిలుస్తామని నాయకుల హామీ





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో రైతుల భూములను ప్రభుత్వ అధికారులు బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను నిరసిస్తూ గ్రామ రైతులు చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్, మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు రైతులతో సమావేశమై వారి సమస్యలను, ఆందోళనకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రైతుల అనుమతి లేకుండా, వారికి పూర్తి సమాచారం ఇవ్వకుండా భూములను స్వాధీనం చేసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. రైతుల జీవనాధారమైన భూముల విషయంలో ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, రైతుల అభిప్రాయాలను గౌరవిస్తూ న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల హక్కులను పరిరక్షించేందుకు బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. రైతులకు అన్యాయం జరిగితే పార్టీ తరపున అన్ని స్థాయిల్లో పోరాటం చేస్తామని, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ రైతుల భూములు కేవలం ఆస్తులు మాత్రమే కాకుండా వారి కుటుంబాల జీవనాధారం అని అన్నారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతుల భూములను బలవంతంగా తీసుకోవడం ఏ మాత్రం సమంజసం కాదని అన్నారు. రైతులు ఎన్నో ఏళ్లుగా కష్టపడి సాగు చేసుకుంటున్న భూములపై ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం బాధాకరమని, రైతుల అనుమతి లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీజేపీ ఎల్లప్పుడూ నిలబడుతుందని, అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ రైతుల పక్షాన పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం రైతుల ఆందోళనలను వెంటనే పరిగణనలోకి తీసుకుని వారి సందేహాలకు సమాధానం చెప్పాలని, న్యాయమైన పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ బిజెపి నాయకులు నరేష్ యాదవ్, పవన్ సాయి, భగవంత్ రెడ్డి, కార్యకర్తలు, రైతులకు మద్దతు ప్రకటించారు.

# భవన నిర్మాణ కార్మికులకు జనసేన అండగా ఉంటుంది...ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

## ఏవీబీ పురంలో లేబర్ కార్డు -- ఈ-శ్రమ్ బీమా కార్డు నమోదు కార్యక్రమానికి శ్రీకారం



**కూకట్ పల్లి, జూలై 19 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఏవీబీ పురంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలోని లేబర్ కార్డు, ఈ-శ్రమ్ బీమా కార్డు నమోదు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో భవన నిర్మాణ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎండనకా, వాననకా కష్టపడి పనిచేస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు సేవలందిస్తున్న కార్మికుల సంక్షేమం ప్రతి ప్రభుత్వానికి ముఖ్య బాధ్యత అని అన్నారు. అలాంటి కార్మికులకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. లేబర్ కార్డు, ఈ-శ్రమ్ బీమా కార్డుల ద్వారా కార్మికులు ప్రమాద బీమా, ఆర్థిక భద్రత, సంక్షేమ పథకాల ప్రయోజనాలు, అత్యవసర పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక సహాయం వంటి అనేక లబ్ధులను పొందే అవకాశం ఉందని ఆయన వివరించారు. ప్రతి నిర్మాణ కార్మికుడు తప్పనిసరిగా నమోదు చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే, భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి జనసేన పార్టీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని, కార్మిక కుటుంబాల భవిష్యత్తు భద్రంగా ఉండేలా అన్ని విధాలుగా అండగా నిలుస్తారని తెలిపారు. ఈ నమోదు కార్యక్రమానికి స్థానిక కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై లేబర్ కార్డు, ఈ-శ్రమ్ బీమా కార్డు నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, కార్మికుల సందేహాలకు నిర్వాహకులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, రణదీప్, సింహాద్రి, ప్రసాద్, గోవింద్, శివశంకర్, దుర్యోధన, రాజు తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని జనసేన నాయకులు పేర్కొన్నారు.







# బహదూర్‌గూడలో మిన్నంటిన రైతాంగ పోరాటం

## ప్రభుత్వంపై సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి నిప్పులు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో బుల్లెట్ రైల్ టెర్మినల్ పేరుతో రైతుల భూములను లాక్కోవడాన్ని నిరసిస్తూ సాగుతున్న భూపోరాటం ఉధృతంగా మారింది. మా భూములను ఎవరు కాపాడతారు అంటూ వేలాది మంది రైతులు, గ్రామస్తులు, యువత ఒక్కటై బహదూర్‌గూడకు భారీగా తరలివచ్చారు. తమ ఉనికిని, జీవనాధారాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి ఐక్యతను చాటారు. రైతుల పిలుపు మేరకు వారికి మద్దతుగా నిలిచేందుకు తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి బహదూర్‌గూడకు చేరుకున్నారు. బాధితుల ఆవేదనను, గోడును వారు శ్రద్ధగా విన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కోర్టు అనుమతులు ఉన్నా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలుపుతున్నా పోలీసులతో అక్రమ గృహ నిర్బంధాలు చేయడం, అడ్డుకోవడం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. భూమి కోసం మొదలైన ఈ పోరాటం రైతు గెలిచే వరకు ఆగదు రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, వారి న్యాయమైన పోరాటంలో చివరి వరకు కలిసి నడుస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# ఉద్యోగాలపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదు

## శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నర్కూడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మండిపాటు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై మాట్లాడే ఎలాంటి నైతిక అర్హత, హక్కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు లేవని శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నర్కూడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేవలం కల్వకుంట్ల కుటుంబానికే పదవులు, అవకాశాలు దక్కాయని, నిరుద్యోగ యువతకు మాత్రం తీవ్ర నిరాశే మిగిలిందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీల వ్యవహారాన్ని తెలంగాణ సమాజం ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రికార్డు స్థాయిలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసిందని శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. టీజీపీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, విద్యుత్ సంస్థలు, ఆర్టీసీ, సింగరేణి, జలమండలి వంటి పలు శాఖల్లో భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపడుతూ యువతకు భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు. మేక తోలు కప్పుకున్న తోడేలు కాపరిని, మందను మోసం చేయాలని చూసినట్లు.. కేటీఆర్ కూడా ఇప్పుడు మాయ మాటలతో, సానుభూతి రాజకీయాలతో తెలంగాణ ప్రజలను, యువతను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వం చేసిన తప్పులను ఒప్పుకుంటూనే, మళ్లీ అధికారంలోకి రావాలనే ఏకైక ఆలోచనతో పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతులకు, అమరవీరుల కుటుంబాలకు పదేళ్ల పాలనలో అన్యాయం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు రేవంత్ రెడ్డిని, సోనియా గాంధీని, రాహుల్ గాంధీని తిడితే హీరోలు అయిపోతామని అనుకోవడం వారి అమాయకత్వమే. ప్రజలు మిమ్మల్ని ఇప్పటికే తిరస్కరించారు. ప్రతిపక్షంగా ప్రభుత్వం చేసే మంచి పనులను గుర్తించాల్సింది పోయి, యువతను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకోవాలని కేటీఆర్‌కు శేఖర్ యాదవ్ సూచించారు. గత పాలనలో జరిగిన వైఫల్యాలు, అవినీతి, ప్రజాధన దుర్వినియోగంపై నిరుద్యోగులకు నిజాయితీగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి- భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా చేపట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ మణికొండ, నెక్నంపూర్, పుప్పాలగూడ ప్రాంతాల్లో నత్తనడకన సాగుతోంది. ఆదివారం భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఆలస్యం నవీన్ కుమార్, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా సేకరించిన సమాచారం ప్రకారం ఇప్పటివరకు కేవలం 60 శాతం ఫారమ్‌లు మాత్రమే అందజేయగా, అందులో కేవలం 25 శాతం ఫారమ్‌లు మాత్రమే తిరిగి వచ్చాయని నాయకులు వెల్లడించారు. బీఎల్‌ఓల వివరాలు సరిగ్గా తెలియకపోవడం, ఫారమ్‌లు పూర్తి చేయడంలో ఇబ్బందులు, 2002 నాటి ఓటర్ వివరాలు అందుబాటులో లేకపోవడం వల్లే ప్రజలు దీనిపై నిర్లక్ష్య వైఖరి చూపుతున్నారని బీఆర్ఎస్ నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు అందే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి సాధించే సరైన ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలంటే ప్రాథమిక హక్కైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితా సవరణకు సహకరించాలన్నారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఫారమ్‌లు తీసుకురావడం, వాటిని పూరించడం, 2002 లోని ఓట్లను ప్రస్తుత ఓటుతో జత చేయడం (మ్యాపింగ్) లో బీఆర్ఎస్ పార్టీ గత కొన్ని రోజులుగా సంపూర్ణ మద్దతు అందిస్తోందని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లక్ష్మణ్ రావు సూచించారు. నెక్నంపూర్ డివిజన్ పోలింగ్ కేంద్రాల నెంబర్ 29 నుండి 57 వరకు ఉన్న బీఎల్‌ఓలను ఒకే చోట అందుబాటులో ఉంచాలన్నారు. మణికొండ డివిజన్ పోలింగ్ కేంద్రాల నెంబర్ 58 నుండి 85 వరకు ఉన్న బీఎల్‌ఓలను మరొక చోట కేంద్రీకృతం చేయాలన్నారు. ఇలాంటి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఓటర్లు తమకు తామే వచ్చి అధికారులకు సంపూర్ణంగా సహకరిస్తారని, తద్వారా ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ విజయవంతం అవుతుందని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్



## కాళేశ్వరం...ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం !

**దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బీఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది.**

ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరించాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్ధరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేఫ్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷–రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది. ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చా అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆరెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమిషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.

## తరాల అనుబంధం – మమతల ప్రవాహం

**ప్రతి వసంత కాలంలోనూ ప్రకృతి ఒక సరికొత్త రూపాన్ని సంతరించుకుంటుంది. ఎండిపోయినట్లు కనిపించే చెట్టు కొమ్మలు మళ్ళీ చిగురిస్తాయి. ప్రాణం లేదనుకున్న ఎండిపోయిన రెమ్మలు కూడా కొత్త ఆకుపచ్చదనాన్ని ఆలింగనం చేసుకుంటాయి. ఇది కేవలం ప్రకృతిలో జరిగే ఒక భౌతిక మార్పు కాదు ఇది జీవితం మనకు నిరంతరం నేర్పే ఒక గొప్ప పాఠం. తోటలో పూలు వికసించడం, వాటి మధుర పరిమళం గాలిలో వ్యాపించడం, తుమ్మెదలు ఆ సువాసనను వెతుక్కుంటూ వచ్చి ఆస్వాదించడం ఇదంతా ఒక చిన్న కాలానికే పరిమితమైన దృశ్యం. ఆ కొద్ది క్షణాల్లోనే ఆ పూలలో నిండైన జీవం ఉంటుంది. మనిషి జీవితం కూడా సరిగ్గా ఇలాంటిదే.**



వంద సంవత్సరాలు బతకాలనే ఆశ ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ నిజమైన జీవితం అనేది మనం ఎన్ని రోజులు బతికామన్న లెక్కింపులో లేదు. మనం ఎంత సంతృప్తిగా, ఎంత ప్రేమతో, ఎంత ఆనందాన్ని పంచుతూ బతికామన్న దానిలోనే జీవిత పరమార్థం దాగి ఉంది. తెలుగు సాహిత్యం, సినిమా పాటలు ఎప్పుడూ ఈ సనాతన జీవన తత్వాన్ని అత్యంత సున్నితంగా, హృదయాన్ని తాకేలా ఆవిష్కరించాయి. పూలు, తుమ్మెదలు, రామచిలుకలు వంటి ప్రకృతి ప్రతీకల ద్వారా జీవితపు లోతైన సత్యాలను సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చెప్పడం మన తెలుగు సాహిత్య సంప్రదాయపు ప్రత్యేకత. ఒక చిన్న పూవు ఉదయాన్నే వికసించి, తన పరిమళాన్ని లోకానికి వెదజల్లి, సాయంత్రానికి రాలిపోయినా, ఆ పూవు తన ఉనికిని వృథా చేసుకోలేదు. అది తన వంతు కర్తవ్యాన్ని పూర్తి చేసి, ఈ సృష్టి చక్రంలో తనదైన పాత్రను పోషించింది. అలాగే మానవ జీవితం కూడా ఎంత సుదీర్ఘంగా సాగింది అనేదాని కంటే, ఎంత అర్థవంతంగా, ప్రయోజనకరంగా గడిపామన్నదే అత్యంత ముఖ్యం. కాలం పరిమాణం కంటే కాలం యొక్క నాణ్యత గొప్పది. జనన మరణాల చక్రంలో అనుబంధాల అమరిక ఎంతో విచిత్రమైనది. మనిషి పుట్టడం, సమాజంలో జీవించడం, ఆ తర్వాత కళ్ళు మూయడం ఇది కాలం రాసిన అమోఘమైన ప్రకృతి నియమం. కానీ ఈ చక్రంలో ఒక అద్భుతమైన సత్యం దాగి ఉంది. ఒక తరం వెళ్ళిపోతున్నప్పుడు, మరో కొత్త తరం ఇక్కడ పుడుతూ ఉంటుంది. మనకు ఎంతో ఇష్టమైన తాతలు, అమ్మమ్మలు వృద్ధాప్యంతో కాలం చేసినా, వారి నిష్కల్మషమైన ప్రేమ, వారు నమ్మిన నైతిక విలువలు మనవళ్ళ రూపంలో మళ్ళీ మన మధ్యకే వస్తాయి. ఇది కేవలం జీవశాస్త్రపరమైన వంశాభివృద్ధి మాత్రమే కాదు ఇది హృదయాల అనుబంధాల కొనసాగింపు, మమతానురాగాల ప్రవాహం. ఒక మనిషి తన ఆత్మీయుడిని కోల్పోయినప్పుడు కలిగే దుఃఖం అత్యంత సహజమైనది. కానీ ఆ గాఢమైన దుఃఖంలోనే, కొత్తగా జన్మించిన పసిబిడ్డ అమాయకపు నవ్వులో, ఆ పాత అనుబంధపు వెచ్చదనం మళ్ళీ చిగురిస్తుందనే సత్యం మనసుకు కొండంత ఓదార్పునిస్తుంది. ఈ తాత్విక భావన మన సాంప్రదాయ కుటుంబ వ్యవస్థలో తరతరాలుగా ఇమిడి ఉంది. తెలుగు సమాజంలో కుటుంబ బంధాలకు ఇచ్చే ప్రాధాన్యత అనన్యసామాన్యమైనది. తాత మనవడు, అమ్మమ్మ మనవరాలు మధ్య ఉండే ఆత్మీయ అనుబంధం కేవలం ఒక బంధుత్వం కాదు, అది తరాల సరిహద్దులను దాటి ప్రవహించే అద్భుతమైన స్నేహ ప్రవాహం. ఒక తరం సంపాదించిన జీవిత అనుభవాలు, విలువైన జ్ఞానం మరో తరానికి సహజసిద్ధంగా బదిలీ అవుతూనే ఉంటాయి. ఈ నిరంతర ప్రయాణమే మన సంస్కృతికి, సమాజానికి అసలైన ప్రాణబలం. ఈ కారణంగానే, మరణం అనేది జీవన ప్రయాణానికి ముగింపు కాదని, అది ఒక కొత్త తరం ప్రారంభానికి వారధి మాత్రమేనని మన పెద్దలు నిత్యం చెబుతూ వచ్చారు. ఈ సత్యాన్ని గ్రహిస్తే ఏ హృదయమూ ఒంటరితనం అనే చీకటిలోకి జారిపోదు. జీవిత ప్రయాణంలో ఎన్ని ఆటంకాలు, కష్టాలు ఎదురైనా, మనస్సులో ఆశను ఎప్పటికీ వదులుకోకూడదన్నదే అసలైన జీవన మంత్రం. ప్రతి ఉదయం సూర్యుడు చీకట్లను చీల్చుకుంటూ కొత్తగా ఉదయించినట్టే, ప్రతి రోజు మనకు సరికొత్త అవకాశాలను, ఆశలను మోసుకొస్తుంది. చిన్న చిలుక కూడా కష్టాలు వచ్చాయని చింతపడుతూ కూర్చోకుండా, ప్రకృతిని ఆస్వాదిస్తూ సాగిపోతుంది. మనం కూడా జీవితాన్ని ఒక భారంగా కాకుండా, ఒక అందమైన చిత్రంగా, ఒక అద్భుతమైన అనుభవాల ప్రయాణంగా చూడాలన్న సానుకూల భావన నేటి ఆధునిక తరానికి ఎంతో అవసరం. నిత్యం తీవ్రమైన ఒత్తిడి, ఆందోళనలతో కూడిన నేటి ఆధునిక జీవన శైలిలో, ప్రతి చిన్న విషయానికి నిరాశ చెందే మనుషులకు ఈ ప్రకృతి నేర్పే పాఠాలు అత్యంత అద్భుతమైన మార్గదర్శకంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. తోటలో కొత్తగా వికసించిన నవమల్లిక పువ్వు చిరునవ్వులు చిందించినట్టు, మనం కూడా జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును ధైర్యంగా, చిరునవ్వుతో ఎదుర్కోవాలి. మన మనసులోని ఆశలను నవ్య సుందర దృశ్యాలుగా మలచుకోవాలి. కష్టాలు వచ్చినప్పుడు మనోధైర్యాన్ని కోల్పోయి కుంగిపోకుండా, అవన్నీ తాత్కాలికమేనని, చీకటి తర్వాత వెలుగు తప్పకుండా వస్తుందని నమ్మకంతో ముందడుగు వేయాలి. ఈ సానుకూల దృక్పథమే మనిషిని ఎంతటి క్లిష్ట పరిస్థితులలోనైనా విజయవంతంగా నిలబెడుతుంది. చివరగా మనం తెలుసుకోవలసిన సత్యం ఏమిటంటే, మానవ జీవితంలో అన్నిటికంటే అత్యంత విలువైనవి కేవలం ప్రేమ, ఆప్యాయత మాత్రమే. మనం సంపాదించే సంపద, అనుభవించే పదవులు, సామాజిక హోదాలు అన్నీ కాలగమనంలో కరిగిపోయే తాత్కాలిక బుడగలు మాత్రమే. కానీ మనం ఇతరులకు పంచే నిష్కల్మషమైన ప్రేమ, మనం పంచుకునే ఆత్మీయ ఆప్యాయత మాత్రమే సమాజంలో శాశ్వతంగా నిలిచిపోతాయి. ప్రతి కొత్త బంధాన్ని మమతతో ఆదరించడం, ప్రతి కొత్త జీవితాన్ని హృదయపూర్వక ఆనందంతో ఆహ్వానించడం ఇదే నిజమైన మానవత్వం యొక్క పరమార్థం. మన కుటుంబంలోనూ, సమాజంలోనూ ఈ మమతానురాగాలను నిరంతరం పెంపొందించుకుంటే, మనుషుల మధ్య దూరం తగ్గి, జీవితం మరింత అర్థవంతంగా, సంతోషదాయకంగా మారుతుంది. ఈ ప్రకృతి సృష్టిలోని అంతర్లీన తత్వాన్ని మనం సంపూర్ణంగా అర్థం చేసుకుంటే, మరణం పట్ల ఉండే సహజమైన భయం తొలగిపోతుంది, అదే సమయంలో జీవితం పట్ల అమితమైన ప్రేమ, గౌరవం పెరుగుతాయి. పూలు, పచ్చని రెమ్మలు, తుమ్మెదలు, పక్షులు మనకు నిత్యం నేర్పే ఈ మహోన్నత జీవన పాఠాలను మన దైనందిన జీవితంలో ఆచరిస్తే, మన బతుకు నిజంగా ఒక అద్భుతమైన కావ్యంగా, అందమైన రంగుల హరివిల్లుగా మారుతుంది. అప్పుడే ఈ సమాజం శాంతికి నిలయంగా మారుతుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## తప్పుచేస్తే ఎవ్వరినీ ఉపేక్షించం

**తప్పు చేసిన వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయింది**

**గుడివాడలో పార్టీ కార్యకర్తల భేటీలో టిడిపి అధినేత బాబు**

గుడివాడ: తప్పు చేస్తే ఎవరైనా ఒకటేనని, చర్యలు తప్పవని టీడీపీ శ్రేణులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. ఒక వ్యక్తి చేసిన తప్పు మొత్తం పార్టీకి చుట్టుకుంటుందని ఆయన అన్నారు. అలా తప్పు చేసిన వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని అన్నారు. గుడివాడ నియోజకవర్గ పార్టీ శ్రేణులతో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. 48వ కార్యకర్తల సమావేశంలో ఆయన ఉత్సాహంగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలకు దిశానిర్దేశర చేశారు. 'జై తెలుగుదేశం' నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు.. గుడివాడలో ఒకప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పు వచ్చిందన్నారు. ఇకపై గుడివాడలో శాశ్వతంగా టీడీపీ జెండా ఎగురుతుందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. పరిధులు లేని పిచ్చితో గొడ్డలి పార్టీ ఉందంటూ ఈ సందర్భంగా వైసీపీపై విమర్శలు చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తే విజయం శాశ్వతంగా ఉంటుందని, 360 డిగ్రీల్లో ఆలోచించి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. 2004లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఉంటే రాష్ట్ర పరిస్థితులు మరోలా ఉండేవని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కార్యకర్తలు అలిగినప్పుడే పార్టీ ఓడిపోయిందని అన్నారు. తనకు అతి పెద్ద కుటుంబం టీడీపీ కుటుంబమేనని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం ప్రజలతో, మధ్యాహ్నం కార్యకర్తలతో మాట్లాడుతున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. 2024 ఎన్నికల కంటే మెరుగైన మెజారిటీ రానున్న రోజుల్లో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వారానికి మూడు గంటలు నియోజకవర్గాల వారీగా డేటా, ప్రభుత్వ నివేదికలను పరిశీలిస్తున్నానని చెప్పారు.

## శివువుల కిడ్నాప్ ముఠా ఆటకట్టు

**నెలరోజుల పసికందును అమ్మేందుకు యత్నం**

**వలపన్ని పట్టుకున్న పోలీసులు**

హైదరాబాద్: గత కొంతకాలంగా శిశువులను అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టుచేశారు. నెల రోజుల పసికందును కిడ్నాప్ చేసి విక్రయించేందుకు ప్రయత్నించిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, శిశువును సురక్షితంగా తల్లి ఒడికి చేర్చారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లి ఒడిలో నుంచి నెల రోజుల పసికందును కిడ్నాప్ చేసిన ఘటన కలకలం రేపగా, పోలీసులు కేవలం ఒకే రోజులో పసిపాపను సురక్షితంగా రక్షించారు. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, పాపను పశ్చిమ బెంగాల్‌కు తరలించి విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా నిందితులు రూ.1.50 లక్షలకు పసిపాపను అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు, ఆన్‌లైన్ ద్వారా ముందస్తు నగదు కూడా స్వీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చందానగర్ పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో వికారాబాద్, హైదరాబాద్, కోల్‌కతా ప్రాంతాల్లో నిందితుల కదలికలను గుర్తించి అరెస్ట్ చేశారు. దీంతో అంతర్రాష్ట్ర శిశు అక్రమ రవాణా ముఠా కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. అనంతరం రక్షించిన పసిపాపను సురక్షితంగా కన్నతల్లికి అప్పగించారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి శిశువును కాపాడిన చందానగర్ పోలీసులు, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు మరోసారి ప్రశంసలు తీసుకొచ్చారు. పోలీసులు ఈ ముఠాకు మరిన్ని రాష్ట్రాలతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తును

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 20-7-2026


# ఉత్తర ఫల్గుణి నక్షత్రం సందర్భంగా అంబికా కాలనీలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలు



**బాలానగర్, జులై 19 (క్రైమ్ మిర్రర్):** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ అంబికా కాలనీలో గల శ్రీ లక్ష్మీనారాయణ గురుస్వామి వారి పూజా మందిరంలో శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి మాస జన్మనక్షత్రమైన ఉత్తర ఫల్గుణి సందర్భంగా అత్యంత వైభవంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. గత 53 నెలలుగా ఎలాంటి విరామం లేకుండా ప్రతి నెలా ఈ మహత్తర సేవా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి సంప్రదాయబద్ధంగా అష్టాదశ అభిషేకాలు, పడి పూజ, అయ్యప్ప భజనలు, హారతులు, మంత్రోచ్చారణలు అత్యంత భక్తిపూర్వకంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో మారుమోగిన భజనలు, "స్వామియే శరణం అయ్యప్ప" నామస్మరణతో పూజా మందిరం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ కుటుంబ సభ్యుల శ్రేయస్సు, ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతుల కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అభిషేకాలు, పడి పూజ అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో భక్తులందరూ పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సేవా భావంతో భక్తులు స్వచ్ఛందంగా సహకరిస్తూ కార్యక్రమం విజయవంతం కావడానికి తమ వంతు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ గురుస్వామి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి అనుగ్రహంతో గత 53 నెలలుగా ఎలాంటి ఆటంకం లేకుండా ప్రతి నెలా ఉత్తర ఫల్గుణి నక్షత్రం సందర్భంగా ఈ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భక్తుల సహకారం, స్వామివారి కృప వల్లే ఈ సేవా కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా మరింత మంది భక్తులు ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక వేడుక భక్తుల్లో భక్తి భావాన్ని మరింత పెంపొందించడంతో పాటు, పరస్పర సేవాభావం, ఐక్యత, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచింది. ప్రతి నెలా నిర్వహిస్తున్న ఈ పూజలు బాలానగర్ పరిసర ప్రాంతాల్లోని అయ్యప్ప భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారి విశేష ఆదరణ పొందుతున్నాయి.



## బహదూర్‌గూడ లాఠీఛార్జ్ బాధితుడిని పరామర్శించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్‌గూడ గ్రామ భూ బాధితులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ పోలీసు చర్యలో భుజానికి తీవ్ర గాయమై శంషాబాద్‌లోని లిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితుడైన రైతును మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి ఆదివారం పరామర్శించారు. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డితో కలిసి హాస్పిటల్‌కు వెళ్లిన ఆమె, రైతు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిరసన తెలుపుతున్న రైతులపై పోలీసులు నిర్దాక్షిణ్యంగా లాఠీఛార్జ్ చేయడం దుర్మార్గమని ఈ సందర్భంగా మండిపడ్డారు. భూములను కాపాడుకునేందుకు పోరాడుతున్న రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



## కిషోర బాలికలు ఆరోగ్యం, శారీరకంగా వచ్చే మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

### సీనియర్ జర్నలిస్ట్ సూర్యకిరణ్

గండిపేట(క్రైమ్ మిర్రర్): కిషోర బాలికలు ఆరోగ్యం, శారీరకంగా వచ్చే మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సీనియర్ జర్నలిస్ట్ సూర్యకిరణ్ అన్నారు. విద్యా భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా భారతి స్వచ్ఛంద సంస్థ పేద బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి సహకారాన్ని అందిస్తుందని ప్రశంసించారు. బాలికలు సరైన అవగాహన లేని కారణంగా కొంతమంది తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, ఇలాంటి కార్యక్రమాల వలన వారిలో అవగాహన పెరుగుతొందన్నారు. బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ శారీరకంగా ధృడంగా ఉండాలన్నారు. ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి రోజు వ్యాయామం చేస్తూ శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు పేద విద్యార్థులకు వివిధ రకాల వస్తువులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాలయ ప్రిన్సిపల్ జుమిలాల్, సంస్థ కోఆర్డినేటర్ స్వప్న, శైలజ, శ్రీజ పాల్గొన్నారు.

## బహదూర్‌గూడ రైతులకు అండగా బీజేపీ

**కాంగ్రెస్ ప్రభుత్వంపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ధ్వజం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో బుల్లెట్ ట్రైన్ టర్మినల్ పేరుతో రైతుల భూములను బలవంతంగా లాక్కోవడాన్ని నిరసిస్తూ సాగుతున్న ఆందోళనకు భారతీయ జనతా పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. భూములు కోల్పోతున్న రైతులకు సంఘీభావం తెలిపేందుకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి బహదూర్‌గూడ గ్రామాన్ని సందర్శించి ధర్నాలో పాల్గొన్నారు. వారికి తోడుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్, పలువురు ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వందలాది మంది రైతుల జీవనాధారమైన దాదాపు 650 ఎకరాల భూమిని తగిన న్యాయం చేయకుండా లాక్కోవాలని చూడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. గతంలో భూమి పట్టాలు ఇస్తామని నమ్మించి, ఇప్పుడు దౌర్జన్యంగా భూములను స్వాధీనం చేసుకుంటుంటే స్థానిక శాసనసభ్యుడు ఎక్కడికి పోయారని వారు నిలదీశారు. పేద ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత చిన్నచూపు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు తగిన న్యాయం జరిగే వరకు వదిలే పరిస్థితి లేదు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఎంత దూరమైనా వెళ్తాం, పెద్ద ఎత్తున నిరసనలు చేపడతాంన్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై వారు నష్టపోకుండా ఉండేందుకు వారి సూచనలు, సలహాలను నేతలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని విధాలుగా అండగా ఉంటామని బీజేపీ నాయకులు గ్రామస్తులకు ఘనంగా హామీ ఇచ్చారు.



## బాబుల్‌రెడ్డినగర్‌లో తెలంగాణ మదరా కురువ, మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాజేంద్రనగర్ మండల శాఖ ఆధ్వర్యంలో కులజుల అవగాహన సదస్సు





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్ శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవాలయం బిర లింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఆదివారం తెలంగాణ మదరా కురువ, మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాజేంద్రనగర్ మండల శాఖ ఆధ్వర్యంలో కులజుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా మాజీ కౌన్సిలర్, కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్, వ్యవస్థాపక అధ్యక్షులు డి.రంగన్న, జేఏసీ కన్వీనర్ కురువ చిన్న మల్లయ్య, రాష్ట్ర కోశాధికారి పసుపుల అశోక్, రాష్ట్ర నాయకులు తిక్కన్నలు హాజరైయ్యారు. వారు మాట్లాడుతూ మన కులపత్ర సాదన ద్వారా కుల హక్కులను ఎలా పొందాలి, అనే అంశంపై ముఖ్య మేలుకువలను భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన వివిధ ప్రోత్సకాలు మొత్తంగా వివరించారు. గత 76 సంవత్సరాల నుంచి మన కులస్తులు కోల్పొయిన హక్కుల విధము, సవరించుకోవాల్సిన ముఖ్యలోపాలను కులజులకు వివరించారు. సభకు హాజరైన కులజుల సమక్షంలో ఎన్నికైన రాజేంద్రనగర్ మండల కమిటీని పరిచయం చేస్తూ వారి సేవలను ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అశోక గ్రాండ్ హోటల్ యజమాని అశోక్, బెల్లంపల్లి వెంకటేష్, బాలరాజు, పోతురాజు, మల్లేష్, కష్ణప్ప, గిర్ని రాములు, ఉప్పల్ శ్రీను, సెంట్రింగ్ శంకర్, వెంకటరమణ, రాజలింగం, నామాల రాము, మహేందర్, రఘువీర్, శివకుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.....

**క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు**
**కంటెంట్ రైటర్లు కావలెను**
**సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం**



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

**9393929595**

# ఆంజనేయ నగర్ కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను

**కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్**



**కూకట్ పల్లి, జులై 19 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ని ఆంజనేయ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ నివాసితులు ఆదివారం శ్రీ హిమదుర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల నిర్వహించిన బైలాస్ కమిటీ సమావేశంలో కాలనీ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై బండి రమేష్ అందించిన అమూల్యమైన సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా తమకు మార్గదర్శకత్వం వహిస్తూ, కాలనీ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ "నేను కేవలం ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, ఆంజనేయ నగర్ కాలనీ నివాసుడిగా కూడా మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను. కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో మీతో కలిసి పనిచేస్తూ, మీకు నిరంతరం తోడుగా నిలుస్తాను" అని హామీ ఇచ్చారు. బండి రమేష్ హామీపై కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, గంట సుబ్బారావు, రామానుజన్ రెడ్డి, ధర్మారావు, ప్రతాప్, హనుమాన్, శ్రీనివాస్, శ్యామ్, చక్రధర్, సుబ్బు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 సోమవారం 20-7-2026

## ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ జాఫర్(45) పేయింటర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి వివాహం జరిగి భార్యతో విడాకులు తీసుకున్నాడు. వికలాంగుడిగా ఉన్న అతను సంవత్సరం క్రితం ఇంట్లో నుంచి నడుచుకుంటూ జ్వరం వచ్చింది ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఇప్పటి వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదు. తల్లి రజియాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు మిస్సింగ్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం

### ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు




గండిపేట(క్రైమ్ మిర్రర్): హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ లో తీవ్ర కలకలం రేగింది. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిని లైంగికంగా వేధించడంతో పాటు అత్యంత దారుణంగా బెదిరింపులకు పాల్పడిన ఆరోపణలపై ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలైన మహిళా ట్రైనీ ఐపీఎస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పలు సంచలన విషయాలను వెల్లడించారు. ఉదయ్ కృష్ణారెడ్డి గత కొంతకాలంగా వాట్సాప్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ, బూతులు తిడుతూ మానసికంగా వేధిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన తన జుట్టు పట్టుకుని బూతులు తిట్టడమే కాకుండా, గొంతు నులమడానికి ప్రయత్నించాడని బాధితురాలు ఆరోపించారు. అంతేకాకుండా, మెడపై కత్తి పెట్టి చంపేస్తానని తీవ్రంగా బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలికి సంబంధించిన కొన్ని ప్రైవేట్ వీడియోలను రికార్డ్ చేసిన ఉదయ్ కృష్ణారెడ్డి, వాటిని ఆమె భర్తకు పంపి తీవ్ర వేధింపులకు గురిచేశాడని ఆరోపణలు వచ్చాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## కోకపేటలో ఘనంగా శ్రీ పూరి జగన్నాథ స్వామి రథయాత్ర

### పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్






గండిపేట(క్రైమ్ మిర్రర్): నార్సింగి సర్కిల్ కోకపేట్ పరిధిలోని హరే కృష్ణ హరే రామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ పూరి జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథయాత్రలో భాగంగా అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో కలిసి ఆయన స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ జగన్నాథ స్వామివారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం, పాడి పరిశ్రమతో పాటు అన్ని రంగాలు అభ్యున్నతి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు, ప్రజలందరూ ఆనందంగా జీవించేందుకు జగన్నాథ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, అశోక్ యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు గౌడ్, విజయ్ బాబు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.....

# ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం [ఎ.ఐ.ఎ.వై.ఎస్] తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్క నాగరాజ్ నియామకం



బాలానగర్, జూలై 19 (క్రైమ్ మిర్రర్) :: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం (ఎ.ఐ.ఎ.వై.ఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్ ప్రాంతానికి చెందిన కర్కనాగరాజ్ అధికారికంగా నియమితులయ్యారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువ సంఘం 30వ కోర్ కమిటీ మీటింగ్ హైదరాబాద్ లకిడికపూల్ సమాంతర కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు ఎస్ వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నియామక పత్రాన్ని రాష్ట్ర కార్యాలయంలో ఎ.ఐ.ఎ.వై.ఎస్ జాతీయ సమన్వయకర్త ఎస్. వరుణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కడారం వినయ్ కుమార్ సమక్షంలో కర్కనాగరాజు కు అందజేశారు. ఈ సందర్భంగా కర్క నాగరాజ్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి 25 సంవత్సరాల నుండి తను చేస్తున్న సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతను అప్పగించిన ఎ.ఐ.ఎ.వై.ఎస్ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూకట్ పల్లి నియోజకవర్గం అధ్యక్షుడిగా గ్రేటర్ కన్వీనర్ గా, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న తనకు రాష్ట్ర స్థాయి పదవి రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. డా. బి. ఆర్. అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లో మరింత విస్తృతంగా చాటుతూ, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సంస్థను మరింత బలోపేతం చేయడానికి సంపూర్ణ అంకితభావంతో, నిబద్ధతతో పనిచేస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎ.ఐ.ఎ.వై.ఎస్ నాయకులు, సభ్యులు, శ్రేయోభిలాషులు, అభిమానులు కర్క నాగరాజ్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన తన నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం (ఎ.ఐ.ఎ.వై.ఎస్ ) గ్రేటర్ హైదరాబాద్ కమిటీని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర కార్యాలయం, రెడ్ హిల్స్‌లో నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సెప్టెంబర్ నెలలో గ్రేటర్ హైదరాబాద్‌ను హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే మూడు విభాగాలుగా విభజించి, ఆయా ప్రాంతాలకు అధ్యక్షులను నియమించి పూర్తి స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్థాపించి ఈ సంవత్సరం సెప్టెంబర్ నెలతో 50 సంవత్సరాల స్వర్ణోత్సవం (గోల్డెన్ జూబ్లీ) పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, భారీ బహిరంగ సభను నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. యువజన సంఘానికి విశేష సేవలు అందించిన సీనియర్ దళిత నాయకులను ఆ సభలో ఘనంగా సన్మానించడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా యువజన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు దుప్పాడ అప్పలరాజు, దాసరి ప్రభు, మంజుల, శాతరి వినయ్ కుమార్, వడ్డే నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర్ నగర్ డివిజన్-248లో బీజేపీ పార్టీ ఘనంగా ఓబీసీ కమిటీ ఏర్పాటు

### ఓబీసీ శక్తిని బలోపేతం చేస్తూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని నాయకుల పిలుపు



కూకట్ పల్లి, జూలై 19 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ వెంకటేశ్వర్ నగర్ డివిజన్-248లో ఓబీసీ కమిటీని డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు సిహెచ్. కృష్ణ మురళి పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ఓబీసీ వర్గాలను సంఘటితం చేయడం, ప్రజలకు మరింత చేరువ కావడం లక్ష్యంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్, రాష్ట్ర ఓబీసీ నాయకుడు గోవర్ధన్ చారి, మాజీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ యాదవ్ హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ బలోపేతంలో ఓబీసీ వర్గాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకుగా వ్యవహరించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి సేవలందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలను ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఓబీసీ నాయకుడు గోవర్ధన్ చారి మాట్లాడుతూ, ఓబీసీ సమాజ అభ్యున్నతికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆకాంక్షించారు. డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు సిహెచ్. కృష్ణ మురళి పటేల్ మాట్లాడుతూ, తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రతి ఓబీసీ కుటుంబానికి పార్టీని చేరువ చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామని అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజు, జనరల్ సెక్రటరీ వినీత్ గౌడ్, ఎం. యాదగిరి, కామరాజు యాదవ్, బీజేపీ నాయకులు ప్రశాంత్, కవిత, సంతోష్, బీజేవైఎం అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహేందర్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుమార్, హరీష్ యాదవ్తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఓబీసీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నూతన కమిటీ సభ్యులను నాయకులు అభినందిస్తూ, పార్టీ అభివృద్ధి, ప్రజా సేవ, ఓబీసీ సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం మొత్తం "జై శ్రీరామ్", "జై జై శ్రీరామ్", "జై ఓబీసీ" నినాదాలతో ఉత్సాహభరితంగా సాగింది.

## బహదూర్‌గూడ రైతులకు అన్యాయం జరగనివ్వం

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పష్టం



గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ మండలం బహదూర్‌గూడ భూముల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. బహదూర్‌గూడ రైతులకు ప్రభుత్వం తరఫున ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. బహదూర్‌గూడ రెవెన్యూ పరిధిలో మొత్తం 1,300 ఎకరాల భూమి ఉందని ఎమ్మెల్యే వివరించారు. అందులో సుమారు 600 ఎకరాలకు సంబంధించి రైతులకు ఇప్పటికే పట్టా పాసు పుస్తకాలు అందజేశామని, మిగిలిన భూములు కోల్పోతున్న రైతులకు ఒక్కొక్కరికి 500 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని గతంలోనే రైతులతో సమావేశమై తెలియజేశామని ఆయన గుర్తుచేశారు. రైతులతో సామరస్యంగా చర్చిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రతిపక్షాలు రాజకీయ స్వార్థం కోసం రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. రైతులను రెచ్చగొట్టి ధర్నాలు చేయించడం, పోలీసులపై తిరగబడేలా ప్రేరేపించడం సరైన విధానం కాదని మండిపడ్డారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేయడం మానుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ అంశంపై సానుకూలంగా ఉన్నారు. కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు ఎవరికీ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు, అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం బహదూర్‌గూడ భూముల వివాదంపై ఎమ్మెల్యే చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...



## పర్యావరణహితంగా బోనాలు ఉత్సవాలు

### ఈదమ్మ పోచమ్మ ఉత్సవాలకు వినూత్న ఏర్పాట్లు

గండిపేట(క్రైమ్ మిర్రర్): అత్తాపూర్ సర్కిల్ హైదర్గూడా చారిత్రక ఈదెమ్మ -పోచమ్మ దేవాలయం బోనాల ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది. వచ్చేనెల తొమ్మిదవ తేదీన జరిగే ఈ ఉత్సవంలో సకలజనులు పాల్గొనాలని కమిటీ పిలుపునిచ్చింది. హైదర్గూడా ప్రణవభక్త సమాజం, వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉత్సవ కమిటీ సమావేశం జరిగింది. సకల జనుల భాగస్వామ్యంతో పర్యావరణానికి అనుకూలంగా ఆదర్శంగా నిలవాలని కమిటీ తీర్మానించింది. ఈనెల 9న ఈ ఉత్సవాలు ఉదయం ప్రారంభమై సాయంత్రం ముగిస్తాయని నిర్వాహకులు తెలిపారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 20-7-2026


# అన్యాయానికి గురైన మహిళలకు అండగా... సామాజిక సేవలో కె. లతక్క

## ఒంటరి మహిళలు, మైనర్ బాలికలు, అనాథలకు ఆశ్రయం -- బాధితుల పక్షాన నిరంతర పోరాటం

### సామాజిక మార్పు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపు



**నల్లగొండ నిఘా (క్రైమ్ మిర్రర్):** సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అన్యాయాలకు ఎదురొడ్డి, బాధితులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, దేవరకొండకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త కె. లతక్క అన్నారు. మహిళలు, మైనర్ బాలికలు, ఒంటరి మహిళలు, అనాథల సంక్షేమం కోసం ఎన్నో సంవత్సరాలుగా ఆమె చేస్తున్న సేవలు స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.మహిళలపై పెరుగుతున్న హింస, కుటుంబ వేధింపులు, మోసాలు, బాల్య వివాహాలు వంటి సమస్యలు సమాజానికి తీవ్ర సవాలుగా మారుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ కలహాలు, వేధింపుల కారణంగా పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం అందని, బాధితులు ఇంకా చాలామంది ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో బాధితులకు ధైర్యం చెప్పడంతో పాటు చట్టబద్ధమైన సహాయం అందించడం అత్యంత అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

**అనాథ అమ్మాయిలకు కొత్త జీవితాన్ని అందించిన సేవలు**

సామాజిక సేవలో భాగంగా అనాథ శరణాలయాల్లో ఉన్న అమ్మాయిలకు ఆశ్రయం కల్పించడం మాత్రమే కాకుండా, వారి భవిష్యత్తు దృష్ట్యా వివాహాలు జరిపించి కొత్త జీవితాన్ని ప్రారంభించేలా సహకరించడం లతక్క సేవల్లో ప్రధానాంశంగా నిలిచింది. కుటుంబ అండ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువతులకు తల్లిలా, అక్కలా నిలిచి మార్గనిర్దేశం చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

**ప్రేమ పేరిట మోసపోయిన బాధితులకు న్యాయం కోసం కృషి**

ప్రేమ పేరుతో మోసపోయిన యువతుల సమస్యల్లో కూడా లతక్క చొరవ తీసుకుంటూ, సంబంధిత కుటుంబాలు, పెద్దలు, అవసరమైతే పోలీస్ అధికారులు, న్యాయ నిపుణులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విడాకుల అంచుకు చేరుకున్న అనేక దంపతులకు కౌన్సిలింగ్ నిర్వహించి తిరిగి కలిసేలా చేసిన సందర్భాలు కూడా ఉన్నాయని చెప్పారు. బాల్య వివాహాల కారణంగా జీవితాలు దెబ్బతింటున్న మైనర్ బాలికల సమస్యలను గుర్తించి, వారికి న్యాయం జరిగేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఘటనలు కూడా ఉన్నాయని వివరించారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై హింస, మోసాలు, బాల్య వివాహాలు, కుటుంబ విభేదాలు వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ యంత్రాంగంతో పాటు సామాజిక కార్యకర్తల పాత్ర కూడా కీలకంగా మారింది. బాధితులు చట్టపరమైన హక్కులపై అవగాహన లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో వారికి మార్గదర్శకత్వం, మానసిక ధైర్యం అందించడం సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడుతుంది. అయితే ఇలాంటి సమస్యల పరిష్కారం ఒక్క వ్యక్తి కృషితో సాధ్యంకాదు. పోలీస్ శాఖ, మహిళా సంక్షేమ శాఖ, న్యాయసేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేస్తేనే, బాధితులకు వేగంగా న్యాయం అందే అవకాశం ఉంటుందన్నారు. అదే సమయంలో ప్రతి కేసు చట్టబద్ధమైన విచారణ, బాధితుల సమ్మతి, సంబంధిత అధికారుల పర్యవేక్షణలోనే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. సమాజ సేవను లక్ష్యంగా పెట్టుకుని మహిళల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న కె. లతక్క వంటి సామాజిక కార్యకర్తలకు ప్రభుత్వ శాఖలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మరింత సహకారం అందిస్తే, మహిళా సాధికారత దిశగా మరిన్ని సానుకూల ఫలితాలు సాధించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# తీపి గురుతుల కలబోత.. అంబరాన్నంటిన ఆత్మీయత

## కనులపండువగా అరవింద విద్యాలయం (1987,88).. పూర్వ విద్యార్థుల సమ్మేళనం

## మహోన్నత సేవా పతక గ్రహీత, సీఐ శ్రీనివాసరావుకు ఘన సత్కారం

## అమెరికా నుంచి విచ్చేసిన మిత్రుడు ఆనంద్‌కు ఉత్సాహభరిత స్వాగతం

## బాల్యపు జ్ఞాపకాలతో సందడి చేసిన పాత నేస్తాలు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:**

**ఎక్కడో వదిలేసిన బాల్యం మళ్లీ కళ్ల ముందుకొచ్చింది. నాలుగు దశాబ్దాల క్రితం నాటి స్మృతులు ఆత్మీయ పలకరింపులతో ప్రాణం పోసుకున్నాయి. పలకల మీద రాసుకున్న అక్షరాలు చెరిగిపోయినా.. మనసుల మీద ముద్రించుకున్న స్నేహం చెరగదని ఆ పాత నేస్తాలు నిరూపించారు. నేలకొండపల్లి మండలం అనంతనగర్‌లోని అరవింద విద్యాలయం 1987, 88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఖమ్మం వైరా రోడ్డులోని త్రివేణీ స్కూల్ ప్రాంగణంలో అట్టహాసంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ వేడుకలో పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని గతస్మృతుల్లో పరవశించిపోయారు.**

**ఆటపాటలతో సందడి..**

ఉదయం అల్పాహారం అనంతరం పీఈటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో పూర్వ విద్యార్థులంతా వయసును మరిచిపోయి ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కూల్ రోజుల నాటి ఆటలు, పాటలతో ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుక ఏర్పాట్లలో, ముఖ్యంగా క్రీడలు, విందు, బహుమతుల పంపిణీలో తిరుపతి నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన మిత్రురాలు రూపారాణి తీసుకున్న చొరవను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.

**ఈ సత్కారం నా జీవితంలో మరువలేనిది..**

ఈ సందర్భంగా, పోలీసు శాఖలో అద్భుత ప్రతిభ కనబరిచి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంచే మహోన్నత సేవా పతకం అందుకున్న ఖమ్మం ఇంటెలిజెన్స్ సీఐ చల్లగుండ్ల శ్రీనివాసరావును మిత్రులంతా కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆత్మీయ సన్మాన పత్రాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ఉద్వేగంతో మాట్లాడుతూ.. పోలీసు శాఖలో నేను ఎన్నో పతకాలు సాధించినా.. కూనవరం వరదల్లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చగలిగానంటే.. ఆ ధైర్యం, క్రమశిక్షణ నాకు ఈ బడిలోనే అలవడ్డాయి. నేను ఎన్ని స్టేట్ మెడల్స్ అందుకున్నా, నా చిన్ననాటి స్నేహితుల చేతుల మీదుగా అందుకుంటున్న ఈ ఆత్మీయ సత్కారం నా జీవితంలో అత్యంత మధురమైనది, చిరస్థాయిగా నిలిచిపోయేదని తన అనుభవాలను పంచుకున్నారు.

**మళ్లీ కలుసుకోవడం నా అదృష్టం..**

ఇదే బ్యాచ్‌కు చెందిన మిత్రుడు, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విద్యనభ్యసించి ప్రస్తుతం అమెరికాలో ఉన్నతస్థాయిలో స్థిరపడిన అవినేని ఆనంద్ ఈ కార్యక్రమానికి హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్వాహకులు ఆయనను వేదికపై ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడినా, తన మూలాలు, మిత్రులు ఇక్కడే ఉన్నారన్నారు. తాను ఇండియాకు వచ్చిన సమయంలోనే ఈ కార్యక్రమం జరగడం, దశాబ్దాల తర్వాత అందరినీ మళ్లీ ఇలా కలుసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. దూరప్రాంతాల్లో ఉన్నా, తమ స్నేహం ఏమాత్రం చెక్కుచెదరలేదని సంతోషం వ్యక్తం చేశారు.

**కృతజ్ఞతలు తెలిపిన నిర్వాహకులు..**

కార్యక్రమం విజయవంతంగా ముగిసిన అనంతరం, నిర్వాహక బృందం తరఫున టి.ఎస్.రెడ్డి మాట్లాడారు. ఈ సమ్మేళనానికి ఏమాత్రం ఆలోచించకుండా వేదికను సమకూర్చిన త్రివేణీ విద్యాసంస్థల అధినేత వీరేంద్రనాథ్ చౌదరికి, అడుగడుగునా ఏర్పాట్లు పర్యవేక్షించిన ఇన్‌చార్జ్‌లు సందీప్, చార్లెస్‌లకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కార్యక్రమాన్ని ఆద్యంతం హుషారుగా నడిపించిన యాంకర్ విజయశ్రీ, ఆటలు ఆడించిన పీఈటీ శ్యామ్ మాస్టర్, కృష్ణ మోహన్, ఫొటోగ్రాఫర్, దూరప్రాంతాల నుంచి శ్రమకోర్చి విచ్చేసిన పూర్వ విద్యార్థులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. తిరిగి మళ్లీ ఇలాగే కలుసుకుందామన్న ఆత్మీయ వీడ్కోలుతో ఈ సమ్మేళనం కనులపండువగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల యం. అప్పారావు, పార్థ సారధి, శివారెడ్డి, లింగారెడ్డి, ఉపేందర్, పాషా, జానకి రామయ్య, తిరుపతి రావు, నాగమణి, శాంత తదితరులు పాల్గొన్నారు.

# ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

### మూడు వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు




**అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 18:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)పై సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు నుంచి బొల్లారం వైపు వెళ్లే మార్గంలో సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఎ=70ఎ4568 నంబర్ గల ఫార్చ్యూనర్ కారు అదుపుతప్పి రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టి ఎదురుగా వస్తున్న రహదారిపైకి దూసుకెళ్లింది.అదే సమయంలో బొల్లారం వైపు వెళ్తున్న ు+08+9450 నంబర్ గల ఎంజీ ఆస్టర్ ఈవీ కారును ఫార్చ్యూనర్ కారు ఢీకొట్టింది. వెంటనే వెనుక నుంచి వస్తున్న ు+08జీ=5762 నంబర్ గల టాటా నెక్సాన్ కారు కూడా ఫార్చ్యూనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ ప్రమాదంలో ఫార్చ్యూనర్ కారులో ప్రయాణిస్తున్న కైలాష్ రామ్ (27), రాజస్థాన్కు చెందిన యువకుడు, టాటా నెక్సాన్ కారులో ప్రయాణిస్తున్న శివ నాగరాజు (43), ఆనంద్‌నగర్, బండ్లగూడ, నాగోల్ అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాదంలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఎంజీ ఆస్టర్ ఈవీ కారులో ఉన్న నలుగురికి ఎలాంటి గాయాలు కాకపోగా, వాహనం మాత్రం దెబ్బతింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# మహేశ్వరంలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

### ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గా గద్దగూటి ఎట్టయ్య ఎన్నిక



**మహేశ్వరం ప్రతినిధి ( క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం గ్రామ ముదిరాజ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని ముదిరాజ్ సంఘం పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది, అనంతరం సంఘం అభివృద్ధికి ఇంతకాలం విశేష సేవలు అందించిన గత కమిటీ సభ్యులను సంఘ పెద్దలకు పూలమాలలు వేసి,శాల్వాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం నూతన కార్యవర్గానికి బాధ్యతలను అప్పగించారు.

- సంఘం బలోపేతానికి, ముదిరాజ్ కులబాంధవుల సంక్షేమమే ధ్యేయంగా ఈ నూతన కమిటీ పనిచేస్తుందని పెద్దలు ఈ సందర్భంగా తెలిపారు.
- నూతన కార్యవర్గ సభ్యులు..
- గౌరవాధ్యక్షులుగా కర్రోల చంద్రయ్య,కాకి ఈశ్వర్,కావాలి జంగయ్య, ?అధ్యక్షులు గద్దగూటి ఎట్టయ్య,
- ఉపాధ్యక్షులు కాకి పరమేష్, కురమిద్ద లింగామయ్య,కాకి మల్లేష్, సుంచు సురేష్, ?ప్రధాన కార్యదర్శి కటికల ధనంజయ్,ఉప కార్యదర్శి కాకి రాజేష్ కుమార్, ?కోశాధికారి మొలగాసి మహేష్, ప్రచార కార్యదర్శి పల్లెమోని అశోక్, యూత్ అధ్యక్షులు గద్దగూటి యాదయ్య,యూత్ ?ఉపాధ్యక్షులు మొలగాసి రవి, నడికుడ రాకేష్, సుంచు శివ కుమార్, సలహాదారులు, సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం ఏర్పటు చేశారు.
- ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ
- గత కమిటీ సభ్యుల అనుభవాలను, సలహాలను తీసుకుంటూ సంఘం బలోపేతానికి, ముదిరాజ్ సోదరుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. సంఘం సభ్యులందరినీ కలుపుకుంటూ, గ్రామంలో పండుగ సాయన్న ముదిరాజ్ విగ్రహం ఏర్పాటు,ముదిరాజ్ భవన నిర్మాణ త్వరలోనే చేపడుతాం మరియు నిరుపేద కులబాంధవుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.
- ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకులు, యువకులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# జాతీయ విద్యార్థి పర్యావరణ క్విజ్ పోటీ (ఎన్ ఎస్ పి సి -2026) - విత్తనం నుండి వృక్షం వరకు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ (ఎన్ ఎస్ పి సి -2026) - విత్తనం నుండి వృక్షం వరకు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుడి భాగస్వామ్యం పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అనే నినాదంతో పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం మరియు విద్యా మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం మరియు తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్ , తెలంగాణ ప్రభుత్వం సహకారంతో పాఠశాల, కళాశాల విద్యార్థుల పరిశోధన విద్యార్థులకు మరియు ఇతరులకు క్విజ్ పోటీలను నిర్వహించటం జరుగుతుంది. ఈ పోటీ లు జులై 15 2026 నుండి సెప్టెంబర్ 15 2026 వరకు కొనసాగుతుంది పాల్గొన్న ప్రతివారికి ఈ -సర్టిఫికెట్ జనరేట్ అవుతుంది 20 సెప్టెంబరు 2026న ఫలితాల ప్రకటన విడుదలవుతుంది జిల్లాలో అత్యధిక స్కోర్ చేసిన ఐదుగురు విద్యార్థులకు మరియు ఎక్కువ మంది విద్యార్థులను పాల్గొనేటట్లు చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సంబంధిత ఉపాధ్యాయునికి జిల్లా కలెక్టర్ చే అభినందన సర్టిఫికెట్ ఇవ్వబడుతుంది



రాష్ట్రస్థాయిలో అత్యధిక స్కోర్ చేసిన విద్యార్థులకు అత్యధిక సంఖ్యలో పాల్గొన్న జిల్లాకు ముఖ్యమంత్రి చే అభినందన సర్టిఫికెట్ ప్రధానం ఉంటుంది జాతీయస్థాయిలో అత్యధిక విద్యార్థులు జిల్లాకు జాతీయస్థాయిలో సన్మాన కార్యక్రమం ఉంటుంది. గతంలో జనగామ జిల్లా జాతీయస్థాయిలో సన్మాన కార్యక్రమాన్ని అందుకోవటం జరిగింది. ఈక్విజి ఎక్సమ్ ఐదు గ్రూపులుగా ఉంటుంది

గ్రూప్ -1లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు

గ్రూప్ -2లో 6 నుండి 8వ తరగతి విద్యార్థులు

గ్రూప్ -3లో తొమ్మిది నుంచి 12వ తరగతి విద్యార్థులు

గ్రూప్ -4లో యుజి పిజీ రీసర్చ్ స్కాలర్ విద్యార్థులు

గ్రూప్- 5లో ఇతరులు పాల్గొనవచ్చు

ఈ క్విజ్ లో పర్యావరణం పై అవగాహన ,పర్యావరణ పరిరక్షణ , హరితగృహ ప్రభావము, సహజ వనరుల వినియోగము, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం , శిలాజ ఇంధనాలు మొదలగు అంశాలకు , అడవుల పరిరక్షణ దాని ఆవశ్యకత కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. రిజిస్ట్రేషన్ కొరకు మరియు ఎన్ ఎస్ పి సి-2026క్విజ్ లో పాల్గొనుటకు లింక్ https://ecomitram.org/organizations ఎక్కువ విద్యార్థులను ఈ పర్యావరణ అవగాహన క్విజ్ లో పాల్గొనేటట్లు చేసి జిల్లాను ప్రథమ స్థాయిలో నిలపాలని ఖమ్మం జిల్లా నేషనల్ గ్రీన్ కాప్స్ కోఆర్డినేటర్ ఇనుముల వెంకటేశ్వర్లు తెలిపారు

## ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీ కాలనీ ప్రేమావతిపేటకు చెందిన విస్లావత్ భాస్కర్ భార్య విస్లావత్‌ళ లలిత(29) ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. అయినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మైనర్ బాలిక అదృశ్యం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మైనర్ బాలిక కనిపించకుండాపోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరాంఘర్ క్రాస్ రోడ్స్ ప్రాంతంలో కురుమయ్య కూతురు వనం అశ్విని(16) అదృశ్యమైంది. బాలిక కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద కుటుంబ సభ్యులు వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కిషోర బాలికలు ఆరోగ్యం, శారీరకంగా వచ్చే మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

### సీనియర్ జర్నలిస్ట్ సూర్యకిరణ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కిషోర బాలికలు ఆరోగ్యం, శారీరకంగా వచ్చే మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సీనియర్ జర్నలిస్ట్ సూర్యకిరణ్ అన్నారు. విద్యా భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా భారతి స్వచ్ఛంద సంస్థ పేద బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి సహకారాన్ని అందిస్తుందని ప్రశంసించారు. బాలికలు సరైన అవగాహన లేని కారణంగా కొంతమంది తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, ఇలాంటి కార్యక్రమాల వలన వారిలో అవగాహన పెరుగుతొందన్నారు. బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ శారీరకంగా ధృడంగా ఉండాలన్నారు. ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి రోజు వ్యాయామం చేస్తూ శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు పేద విద్యార్థులకు వివిధ రకాల వస్తువులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాలయ ప్రిన్సిపల్ జుమిలాల్, సంస్థ కోఆర్డినేటర్ స్వప్న, శైలజ, శ్రీజ పాల్గొన్నారు.

## టీడీపీ సర్పంచ్ ని బెదిరించి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ చేసుకున్నారు

### తెలుగుదేశం పార్టీ పాలేరు నియోజకవర్గ నాయకులు కొండబాల కరుణాకర్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఆరెగూడెం టీడీపీ సర్పంచ్ వద్దే విశాల విజయ్ ని కాంగ్రెస్ నాయకులు అదిరించి బెదిరించి కాంగ్రెస్ పార్టీ లో చేర్చుకున్నారని తెలుగుదేశం పార్టీ పాలేరు నియోజకవర్గ నాయకులు కొండబాల కరుణాకర్ అన్నారు. నిన్న నేలకొండపల్లిలో ఆయన మాట్లాడుతూ ఒక సర్పంచ్ ని బెదిరించి పార్టీ మార్చినంత మాత్రానమా టీడీపీ పార్టీ బలం తగ్గినట్లు కాదు ఈ రోజు మంత్రులు గా ఉన్న ముగ్గురు కి కూడా మా టీడీపీ ఓట్లు వేస్తేనే గెలిచారని మర్చిపోవద్దన్నారు. మా పార్టీ ఉనికి చూసి భయ పడే వారు రేపు2028 లో వచ్చే ఎన్నికలలో ఎలా గెలవగలరో వారికి అర్థం కావడం లేదు ఇలాంటి మిత్ర ద్రోహం చాలా విచారకరమని అన్నారు.



## గెలిపించిన ప్రజలకు షాకిచ్చిన అరెగూడెం

### సర్పంచ్ వద్దె విశాల విజయ్

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం డిసెంబర్ లో జరిగిన ఆరెగూడెం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం , బి ఆర్ ఎస్, బి జె పి పార్టీ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థిగా వద్దే విశాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పై విజయం సాధించారు. సంవత్సరం తిరగకుండానే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గెలిపించిన గ్రామ ప్రజలకు షాక్ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ కాంగ్రెస్ అధికారంలో లేకున్నా టిఆర్ఎస్ పార్టీ ప్రలోభాలకు గురిచేసిన నాటి అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్లకు గురిచేసిన గెలిపించిన పార్టీ కోసం గ్రామ ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీలోనే నిలిచారు. ప్రస్తుత సర్పంచ్ గెలిపించిన పార్టీని వదిలి అధికార పార్టీలోకి వెళ్ళటంతో గ్రామస్తులంతా షాక్ లో ఉన్నారు. శనివారం నేలకొండపల్లి మండలం అరెగూడెం లో రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు ఆధ్వర్యంలో ఆరెగూడెం సర్పంచ్ వద్దే విశాల విజయ్ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సర్పంచ్ వద్దే విశాల విజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పాలేరు నియోజకవర్గం లో అభివృద్ధి కార్యక్రమాలు చూసి మన గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు

## మధిర అభివృద్ధికి మల్లు భట్టి విక్రమార్క మరో చరిత్ర

### కాంగ్రెస్ పార్టీ నాయకులు బొబ్బిళ్ళపాటి బాబురావు



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం:** మధిర నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నూతన ప్రభుత్వ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల స్థాపనకు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అనుమతి మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొబ్బిళ్ళపాటి బాబురావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి మధిర నియోజకవర్గానికి ప్రభుత్వ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందు బాటులోకి తీసుకురావాలనే భట్టి విక్రమార్క దూరదృష్టి ఫలితమే ఈ కళాశాల అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం మధిర ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాలను మరింత విస్తరించడంతో పాటు నియోజకవర్గ విద్యా ప్రగతికి కొత్త దిశను చూపుతుందని అన్నారు. మధిర ప్రజల ఆశయాలను నెరవేర్చుతూ విద్యా రంగంలో చిరస్మరణీయ నిర్ణయం తీసుకున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బొబ్బిళ్ళపాటి బాబురావు పేర్కొన్నారు.

## మత్స్య సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో నల్గొండలో సెక్షన్ 163 అమలు




### ఈ నెల 20, 21 తేదీల్లో ఎన్నికల కేంద్రం పరిసరాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు.

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్): నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం మూసీ గ్రామానికి చెందిన, మత్స్య శాఖ సహకార సంఘం లిమిటెడ్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. నల్గొండ పట్టణంలోని మహిళా సమాఖ్య భవన్, మిర్యాలగూడ రోడ్ డీటీసీ సమీపంలో జరగనున్న నేపథ్యంలో, జూలై 20, 21 తేదీల్లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 163 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ప్రకటించారు.

**అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రత్యేక నిఘా**

ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు ఎన్నికల కేంద్రం, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పవార్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి సంఘటనలు, చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. సెక్షన్ 163 అమలులో ఉన్న సమయంలో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం, అనుమతి లేని ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసనలు, బహిరంగ సభలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలు, శాంతిభద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలకు పాల్పడిన వారిపై, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు, వారి ప్రతినిధులు, సభ్యులు, మద్దతుదారులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎన్నికల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలను ప్రతి ఒక్కరూ గౌరవించి సహకరించాలని కోరారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు, పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై, ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.